

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

శుక్రవారం,23 జనవరి 2026

8 పేజీలు


## జలజీవన్ మిషన్ పనులు
# వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేయాలి
- త్వరలో క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలన

డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశంలో ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ,మేజర్‌న్యూస్** : జిల్లాలో జలజీవన్ మిషన్ కింద చేపట్టినపనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాల్‌లో జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సంబంధిత కమిటీ సభ్యులతోకలసిసమావేశం నిర్వహించారు. జలజీవన్ మిషన్ కింద చేపట్టిన పనుల పురోగతి, స్వచ్ఛ భారత్ కింద చేపట్టిన మరిగుదొడ్ల నిర్మాణ పనుల ప్రగతిని, వాటర్ గ్రిడ్ కిందచేపట్టిన పనులపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి త్రాగునీరు అందించే పనులనుత్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జలజీవన్, స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేపట్టిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. త్వరలో తాను కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తి చేసిన పనులను, పురోగతిలో ఉన్నపనులను పరిశీలిస్తాన్నన్నారు. జిల్లాలో జలజీవన్ మిషన్‌కింద

- తరువాయి 2లో..

# గొల్లపల్లిని పరామర్శించిన జగ్గిరెడ్డి

- పలువురు నేతలు పరామర్శ



**రావులపాలెం,మేజర్‌న్యూస్** : మాజీ మంత్రి,రాజోలు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ గొల్లపల్లి సూర్యారావు ఇటీవల హైదరాబాద్‌లో గుండె సంబంధిత శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసుకుని బుధవారం రావులపాలెంలోని తన నివాసానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. వారితోపాటు రాష్ట్ర కార్యదర్శి–రాజోలు నియోజకవర్గ పరిశీలకులు కర్రీ పాపారాయుడు, రాష్ట్ర కార్యదర్శి – కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి నేతల నాని, స్టేట్ బూత్ కమిటీజనరల్ సెక్రటరీ మార్గాన్ని

- తరువాయి 2లో..

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే
# అసత్య ఆరోపణలు

- దేవాలయ భూముల్లో కోడి పందాలు, జూదాలు ఆడించిన చరిత్ర ఇజ్రాయల్‌ది
- బొమ్మి ఇజ్రాయల్‌పై మండిపడ్డ కూటమి నేతలు
- అవినీతి ఆరోపణలు సాక్ష్యాధారాలతో నిరూపించాలని సవాల్



**అమలాపురం,మేజర్‌న్యూస్** : ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుపై, నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయల్ చేస్తున్న అసత్య ఆరోపణల పట్ల కూటమి దళిత జనసేన నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ అల్లాడ సోంబాబు స్వగృహం నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో

- తరువాయి 2లో..

# రామచంద్రపురంలో వైసీపీకి షాక్

## పసుపు కండువా కప్పుకున్న 50 మంది కార్యకర్తలు

- అభివృద్ధికి ఆకర్షితులయ్యే చేరికలు..
- స్పష్టం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం,మేజర్‌న్యూస్** : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపట్ల ప్రజల్లోపెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా రామచంద్రపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకివలసల పరంపర కొనసాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదర్శ పాలన, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి భారీగా కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు.

**ఘనంగా పార్టీలోకి ఆహ్వానం**

గురువారం రామచంద్రపురంలోని 13వ వార్డు బ్రాడీపేటలో లంక శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 50మంది వైసీపీకార్యకర్తలు,మహిళలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనతో విసిగిపోయిన ప్రజలు ఇప్పుడు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. "అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మా ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ చేరికలే నిదర్శనం" అని ఆయన పేర్కొన్నారు. హామీల అమలులో వైఫల్యం, అభివృద్ధి నిలిచిపోవడమే వైసీపీ పతనానికి కారణమని విశ్లేషించారు. కూటమిసీనియర్ నాయకులు వాసంశెట్టిసత్యం మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింతబలోపేతంచేయడమేలక్ష్యంగా పనిచేస్తున్నామని, ఈచేరికల పరంపర ఇంకా కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, టిడిపిపట్టణ అధ్యక్షులు ఉండవెల్లిశివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, ఎస్కేపిపి ట్రస్ట్ చైర్మన్‌సలాదినాయుడు, శివాలయం ట్రస్ట్ చైర్మన్ గణేష్ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఏఎంసి డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, కంచుమర్తి బాబురావు, కవలనానాజీ, బ్రాడీపేటవార్డ్ ప్రెసిడెంట్ గిరిబాబు, కూటమి పార్టీ నాయకులు, మహిళా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

# ఆర్టీసీ 'సంక్రాంతి' రికార్డు..

## గతేడాది కంటే మెరుగైన ఫలితాలు!

- తూర్పుగోదావరిజిల్లాలో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో
- స్త్రీ శక్తి పథకంతో భారీగా పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- సిబ్బందిని అభినందించిన జిల్లా ప్రజారవాణా అధికారి వై.ఎస్.ఎన్.మూర్తి



**రాజమహేంద్రవరం, సూర్య ప్రధాన ప్రతినిధి:** తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా విభాగం అద్భుత ప్రగతిని కనబరిచింది. 2025 ఏడాదితో పోలిస్తే ఈఏడాది ఆదాయం (ఈపీకె) మరియు ప్రయాణికులరాక (ఆక్యుపెన్సీ రేషియో)లో గణనీయమైన వృద్ధిని సాధించి రికార్డు సృష్టించింది. స్త్రీశక్తి పథకం అమలులో ఉన్నప్పటికీ, సంస్థ లాభదాయక దిశగా పయనించడం విశేషం.

**గతేడాది కంటే రెట్టింపు ప్రయాణికులు**

గత 2025 సంక్రాంతి సీజన్‌లో 301 బస్సుల ద్వారా 20,027 మంది ప్రయాణికులకు సేవలు అందించి, 35 రూపాయల ఈపీకె మరియు 61శాతం ఆక్యుపెన్సీ రేషియోను ఆర్టీసీ నమోదు చేసింది. అయితే, ఈ ఏడాది సరికొత్త రికార్డులు నమోదయ్యాయి.

- తరువాయి 2లో..

# హెల్మెట్, సీట్ బెల్ట్ ధారణతో ప్రాణ రక్షణ



– హెల్మెట్ ర్యాలీ ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు,మేజర్ న్యూస్ : హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం కారణంగా రహదారి ప్రమాదాల నుండి ప్రాణ రక్షణ పొందవచ్చని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు.జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక శాంతి నగర్ లో గురువారం నిర్వహించిన బైక్ ర్యాలీ ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రహదారి ప్రమాద సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరూ రహదారి నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చాలామంది వాహనదారులు హెల్మెట్ ధరించడంపై పలు కారణాలు తెలుపుతున్నారని, కానీ ప్రమాదం కారణంగా ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి ఎంతటి తీరని లోటో ఆలోచించుకుని, ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రహదారి భద్రత నియమాలు, హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. రహదారి ప్రమాదాలు నియంత్రణకు రహదారి భద్రత నియమాలపై ప్రతీ ఒక్కరికీ ముఖ్యంగా పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.

రహదారి ప్రమాదాల కారణంగా జిల్లాలో ఒక్క ప్రాణ నష్టం జరగకుండా ప్రజలలో విస్తృత అవగాహనకు రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రవాణా శాఖ ఉప కమీషనర్ కృష్ణారావు, ఆర్టీవో శేఖర్, మోటార్ వాహనాల డీలర్లు,జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ లో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు

**ఆగిరిపల్లి,మేజర్న్యూస్:** ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్వయం ప్రతిపత్తి) తన ప్రాంగణంలో కృత్రిమ మేధస్సు, క్వాంటం మేధస్సు,సమగ్ర సాంకేతికతలలో తాజా పురోగతులు అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును మే 8,9 తేదీలలో నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ వెంకట్రావు గురువారం ప్రకటించారు. ఈ ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ సదస్సుకు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, భారత ప్రభుత్వం, న్యూఢిల్లీ వారి మద్దతు ఉందని,ఇది ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న నాలుగో అంతర్జాతీయ సదస్సు 2026పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులకు కృత్రిమ మేధస్సు,క్వాంటం మేధస్సు,సమగ్ర సాంకేతికతలపై ఆధునిక పరిశోధనలను పంచుకునే అంతర్జాతీయ వేదికగా నిలవడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.దీని ద్వారా పరిశోధనలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు,అకాడమిక్ విశ్వసనీయత , విస్తృత ప్రచారం లభిస్తుంది.ముఖ్య తేదీలు పూర్తి పరిశోధనా పత్రాల సమర్పణ చివరి తేదీ: 5 ఏప్రిల్ ఆమోదం, నిరాకరణ సమాచారం,15 ఏప్రిల్ ,కెమెరా రెడీ పేపర్ అండ్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 30 ఏప్రిల్ సదస్సు తేదీలు: 8,9 మే 2026.




చైర్మన్ డా.ఆర్. వెంకట్ రావు సదస్సు వెబ్ సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా.ఆర్.వెంకట్ రావు,డా.సి.నాగ భాస్కర్ శ్రీ తేజసాయి,డా. జి.సాంబశివ రావు, డా.కె.వి.సాంబశివ రావు, డా.డి.సునీత, ప్రొ.బి.వేణు గోపాల్,డా. జె.రాజేంద్ర ప్రసాద్,డా. బి.హెచ్.దాసరథ్ రామ్,డా.సి.హెచ్.వి.మురళీ కృష్ణ,డా.పి.రాజేంద్ర కుమార్ తదితర విభాగాధిపతులు, అధ్యాపకులు. పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు

**మొదటిపేజి తరువాయి**

పలువురు నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయల్ తన వైఖరి మార్చుకోకపోతే రాజకీయంగా భూస్థాపితం చేస్తామని, వీధుల్లో తిరగనివ్వకుండా ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఈ ఏడుపు

ఎస్.యానాం బీచ్‌లో ఎమ్మెల్యే ఆనందరావు నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు 5 లక్షల మందికి పైగా హాజరై సక్సెస్ చేయడాన్ని ఇజ్రాయల్ జీర్ణించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వం పర్యాటక రెస్టారెంట్లను ధ్వంసం చేస్తే, ఈ ప్రభుత్వం పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తోందని, ఇది చూసి ఓర్వలేకనే నిందలు వేస్తున్నారని నేతలు విమర్శించారు. చల్లపల్లి – ఎస్.యానాం రైతులకు రోడ్లు వేయించి, ఆక్వా ఉత్పత్తుల రవాణాకు సౌకర్యం కల్పించిన ఘనత ఎమ్మెల్యేదేనని పేర్కొన్నారు. నీ చరిత్ర అంతా 'బ్లాక్ మెయిల్' బతుకే, గతంలో తిరుపతి లెటర్లు అమ్ముకున్నందుకు టీటీడీ ఇజ్రాయల్‌ను నిషేధించిన విషయాన్ని నేతలు గుర్తుచేశారు. అల్లవరం మండలంలో కోడిపుంజులు పట్టుకుని తిరగడం, గుండాట బోర్డుల వద్ద డబ్బులు పోగొట్టుకోవడం, స్టేజీలపై రికార్డింగ్ డ్యాన్సులు వేయడం వంటి పనులు చేసిన వ్యక్తికి సంస్కృతి గురించి మాట్లాడే హక్కు లేదని నిలదీశారు. దేవాలయ భూముల్లో కోడి పందాలు, జూదాలు ఆడించిన చరిత్ర ఇజ్రాయల్‌ది కాదా అని ప్రశ్నించారు. పోలీస్ అధికారులను 'బ్రోకర్లు' అని సంబోధించడం ఇజ్రాయల్ దిగజారుడుతనానికి నిదర్శన మని, అసలైన బ్రోకర్ పనులు చేస్తూ ఎదిగింది ఆయనేనని మండిపడ్డారు.

దమ్ముంటే అవినీతిని నిరూపించు !

కాంట్రాక్ట్ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న ఎమ్మెల్సీ, దమ్ముంటే సాక్ష్యాధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు.అభివృద్ధి కోసం కష్టపడుతున్న అధికారులను టార్గెట్ చేయడం మానుకోవాలని, లేదంటే రోడ్ల మీద ప్రజలు తిరిగనివ్వరని హెచ్చరించారు. దేవాదాయ శాఖ భూమిలో కోడి పందాలు, గుండాటలు వద్దు అంటే టిడిపి మండల అధ్యక్షులుపై ఎస్సి, ఎస్టి కేసు పెట్టావు. దళిత వాలంటీర్ జనుపల్లి దుర్గా ప్రసాద్ హత్య జరిగినప్పుడు కనీసం పట్టించుకోని వ్యక్తివి నీవు ఇప్పుడు దళిత అధికారులపై విషం చిమ్మడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్ట మహాలక్ష్మి ప్రభాకర్, దండోరా నాయకులు లూటుకుర్తి చిన్న, జనసేన కౌన్సిలర్ ఏడిద శ్రీను, వీర మహిళా కొప్పుల నాగ మానస, బీజేపీ నాయకులు మోకా సుబ్బారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికార జయలక్ష్మి, దేశంశెట్టి లక్ష్మి నారాయణ, జనసేన నల్లా శ్రీధర్, నల్లా చిట్టి బాబు, నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, తిక్కిరెడ్డి నేతాజీ, బొర్రా ఈశ్వరరావు, పెద్దిరెడ్డి రాము, ఆకుల సూర్యనారాయణ మూర్తి, చిక్కం సుధా సూరిమోహన్, ఆకుల బుజ్జి, పోలిశెట్టి బాబులు, పిండి రాజా తదితరులు పాల్గొన్నారు.

# జలజీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలి

**మొదటిపేజి తరువాయి**

రూ.498.59 కోట్లతో 1007 పనులు చేపట్టగా వాటిలో ఇంతవరకు 581 పనులు పూర్తయ్యాన్నారు. పురోగతిలో ఉన్న మిగిలిన 426 పనులను వేగవంతంగాపూర్తిచేయాలని అధికా రులకు స్పష్టం చేశారు.జిల్లాలో 20మండలాల పరిధిలో 667 నివాసిత ప్రాంతాల్లో 2,02,084 గృహాలకు గాను ఇంతవరకు 1,12,858 గృహాలకు కుళాయి కనెక్షన్ లు అందించారని మిగిలినవి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో వాటర్ గ్రిడ్ కింద నాబార్డ్ నిధులు 1650 కోట్లతో త్రాగు నీటి సరఫరా ప్రాజెక్ట్ పనులు వివరాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఆయా మండలాల్లో వివిధ ఎస్సీ,బీసీ సంక్షేమ వసతి గృహాలలో చేపట్టినకమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణపనులలో పురోగతి కనబరచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎస్‌ఈ ఎండి అబ్దుల్ మతీన్, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, డ్వామా పిడి ఎ.వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సమాచార పౌర సంబంధాలశాఖ ఇంచార్జి డీడీ ఆర్వీఎస్ రామచంద్ర రావు, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిని పరామర్శించిన జగ్గిరెడ్డి

**మొదటిపేజి తరువాయి**

గంగాధర్,రాష్ట్రపబ్లిసిటీ వింగ్స్ సెక్రెటరీ ముసునూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి డేవిడ్, రాజోలు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు గుర్రం జాషువా, సోషల్ మీడియా అధ్యక్షులు జిల్లెళ్ళ ఉదయ్ కిరణ్, రాజోలు గ్రామ శాఖ అడబాల జానకిరామ్, ముదునూరి లతేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ 'సంక్రాంతి' రికార్డు..

**మొదటిపేజి తరువాయి**

2026 సంక్రాంతి పండుగకు కేవలం 262బస్సులను నడిపినప్పటికీ, సమర్థవంతమైన నిర్వహణతో ఏకంగా 36,821 మందిని గమ్యస్థానాలకు చేర్చారు.

ఆదాయంపరంగా చూస్తే ఈసారి 41.67రూపాయల ఈపీకె మరియు70 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించి ఆర్టీసీ తన సత్తా చాటుకుంది.

**అడ్డంకులను అధిగమించి..విజయ తీరాలకు!**

2025 ఆగస్టు 15 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆదాయం తగ్గుతుందని భావించినప్పటికీ, పక్కా ప్రణాళికతో జిల్లా యంత్రాంగం అద్భుత ఫలితాలను సాధించింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారి సంఖ్య ఈ ఏడాది అనూహ్యంగా పెరగడం గమనార్హం.

**పక్కా పర్యవేక్షణ.. సురక్షిత ప్రయాణం**

సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్సు స్టేషన్లలో అధికారులు, సూపర్వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు బస్సుల సంఖ్యను పెంచారు.

మెయింటెనెన్స్ విభాగం తీసుకున్న ముందస్తు జాగ్రత్తల వల్ల ఎక్కడా బ్రేక్‌డౌన్‌లు గానీ, అవాంఛనీయ సంఘటనలు గానీ జరగకుండా సున్నా ప్రమాదాలతో ప్రయాణాన్ని పూర్తి చేశారు. రద్దీ సమయంలోనూ ఎంతో క్రమశిక్షణతో కూడిన రవాణా సౌకర్యాన్ని ప్రయాణికులకు అందించారు.

**అధికారుల అభినందన**

ఈ అద్భుత విజయానికి కారకులైన ఆర్టీసీ అధికారులు, సూపర్వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు మరియు ఇతర సిబ్బందిని జిల్లా ప్రజా రవాణా అధికారి (డిపిటివో) వై.ఎస్.ఎన్. మూర్తి ప్రత్యేకంగా అభినందించారు. అందరి సమిష్టి కృషితోనే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. తమను ఆదరించి, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కాజులూరు మండలంలో అభివృద్ధి శంకుస్థాపనల హోరు

**– రూ.1.79 కోట్లతో 13 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి సుభాష్ శంకుస్థాపన**



**రామచంద్రపురం/కాజులూరు, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. పల్లె వెలుగు 2.0, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.1.79 కోట్ల భారీ నిధులతో 13 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం శంకుస్థాపన చేసి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గడచిన 19 నెలల కాలంలో రామచంద్రపురం నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో అభివృద్ధి చేశామని, రానున్న పుష్కరాలకు మరో 130 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు.గ్రామాల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి. పల్లెల్లో పటిష్టమైన రహదారులు ఉంటేనే రైతు, కార్మికుడు, సామాన్యుడు నేరుగా లాభపడతాడు అని అన్నారు. ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులను పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాజులూరు మండలంలోని తనుకువాడలో రెండు రోడ్డు పనులకు రూ.43 లక్షలు, శలపాక గ్రామంలో రోడ్డుకు రూ.10.5 లక్షలు, గొల్లపాలెంలోని రెండు పనులకు రూ.22.50 లక్షలు, ఆర్య వటవంలో మూడు పనులకు రూ. 50.05 లక్షలు, పెనుమళ్ళలో 2 పనులకు గానూ రూ.22 లక్షలు, తనుమళ్ళ లో రోడ్డుకి రూ.11 లక్షలు ఆండ్రంగిలో రెండు రోడ్డు పనులకు రూ.20.50 లక్షలు మొత్తంగా ఒక కోటి 79 లక్షల 60 వేలుతో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్లను సుందరంగా తీర్చిదిద్దామని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి, నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిని తీసుకొస్తోంది అని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాల్లో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పడతాయని, రానున్న రోజుల్లో కాజులూరు మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి సుభాష్ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు) మండల ప్రజా పరిషత్ అధికారి జె.రాంబాబు, పంచాయతీరాజ్ జెఈ భవాని శంకర్, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ రాజేంద్ర, ఆ దబ్బులు ఇస్ జేఈ స్వరూప, కూటమి పార్టీ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, సెక్రటరీలు, ఎంపీటీసీలు, డిసీలు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఉద్యోగుల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ ఉద్యోగుల సంక్షేమ దృష్ట్యా శ్రీ సూర్య ఐ కేర్ కంటి ఆసుపత్రి, ఎఎల్ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామని ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ శిబిరాన్ని శ్రీ సూర్య ఐ కేర్ ఆసుపత్రి సీఈఓ & ఎండీ డా. ఏ.టి. రాంప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ పేర్కొంటూ, శిబిరం ఏర్పాటు చేసిన శ్రీ సూర్య ఐ కేర్ ఆసుపత్రి, ఎఎల్ ఐ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఆస్పత్రి సీఈవో, ఎండి డా. ఏ.టి. రాంప్రకాష్ మాట్లాడుతూ, అడ్వాన్స్ లామినార్ ఎయిర్ ఫ్లో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కాకినాడలో కంటి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, మేనేజర్ శిరీష్, అకౌంటెంట్ రాంశాస్త్రి, సూపరింటెండెంట్ సీతారాం, డాక్టర్ సత్యనారాయణ, ఆసుపత్రి మేనేజర్ ఆదిత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న నిత్యా అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి గురువారం ఆలమూరు మండలం, చొప్పెల్లకు చెందిన గుల్లపూడి వీరమంగారావు గంగామణి దంపతు లు వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు విరాళంగా అందించారు.

వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. దాతలకు చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సీనియర్ అసిస్టెంట్ మనోజ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డిఆర్వో వెంకటరావు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో జరుగుతున్న 77వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను గురువారం సాయంత్రం డీఆర్వో వెంకటరావు.. కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాల్స్ ఏర్పాటు, బారికేడింగ్, వేదిక అలంకరణ, శకటాల తయారీ వంటి పనులను ఈ సందర్భంగా పరిశీలించి, సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి,పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26న, సోమవారం జరగనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సాధారణ ప్రజలు, ముఖ్య అతిథులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో ఆయన వెంట కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్. కుమారి, డీఆర్డీఏ, మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బొబ్బర్లంక లంక భూముల ఆక్రమణ తక్షణమే ఆపాలి

**– గ్రామస్తుల నిరసన**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామ ప్రజలు తరతరాలుగా మత్స్యకారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామానికి చెందిన రెగుల్లంక భూములను సాగు చేస్తూ జీవిస్తున్న రైతులు, మత్స్యకారులు వసిష్ఠ ఫార్మింగ్ అండ్ కల్టివేటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధి పొందుతున్నారు. జిల్లా మొత్తానికి నీరు సరఫరా చేయాలనే పేరుతో మెగా కంపెనీ బొబ్బర్లంక గ్రామ పరిధిలో నీటి ప్లాంట్ల నిర్మాణం ప్రారంభించింది. కానీ ఈ ప్రాజెక్టు పేరుతో గ్రామానికి చెందిన లంక భూములను అన్యాయంగా ఆక్రమించే ప్రయత్నం జరుగుతోంది. ఇది గ్రామ ప్రజల జీవనాధారంపై ప్రత్యక్ష దాడి చేయడమే అని లంక భూములు లేకపోతే బొబ్బర్లంక గ్రామ ప్రజలకు జీవనోపాధి లేదు సాగు లేకపోతే రైతులకు ఉపాధి లేదు. మత్స్యకారం లేకపోతే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుంది. అయినా గ్రామ ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా, వారి అభిప్రాయాలను పట్టించుకోకుండా భూములను తీసుకోవడం తీవ్రమైన అన్యాయమని ప్రజల భూములను తీసుకుంటే న్యాయమైన పరిహారం, ప్రత్యామ్నాయ భూములు, స్థిరమైన ఉపాధి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని కంపెనీదీ. కానీ ఇప్పటివరకు గ్రామ ప్రజలకు ఎలాంటి హామీలు ఇవ్వలేదు. ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక చర్య అని ఈ పరిస్థితిని వసిష్ఠ ఫార్మింగ్ అండ్ కల్టివేటింగ్ సొసైటీ తీవ్రంగా ఖండిస్తోంది.బొబ్బర్లంక గ్రామ లంక భూముల ఆక్రమణను వెంటనే ఆపాలి గ్రామ ప్రజలకు న్యాయం జరిగే వరకు మేము మౌనంగా ఉండమని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని భూముల ఆక్రమణను నిలిపివేయాలి, గ్రామ ప్రజలతో బహిరంగ చర్చలు నిర్వహించాలి, న్యాయమైన పరిహారం హక్కులు హామీ ఇవ్వాలి, లేకపోతే గ్రామ ప్రజలతో కలిసి ఉద్యమాలు, నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# డివిజన్ పర్యటనలో ఎదురైన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**– ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలోని రమణయ్యపేట మార్కెట్ ప్రాంతంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. మసీదు వీధిలో పర్యటిస్తున్న సమయంలో స్థానికులు డ్రైనేజీల్లో నుంచి తీసిన సిల్ట్‌ను రోడ్డుపై వేసి అలాగే వదిలేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఇంచార్జ్ కమిషనర్ వెంటనే సంబంధిత అధికారులకు ఆ సిల్ట్‌ను తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆ వీధిలో ఉన్న సీసీ రోడ్డు సమస్యను కూడా స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, తక్షణమే ఇంజినీరింగ్ అధికారులకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అలాగే ఆ ప్రాంతంలోని త్రాగునీటి నాణ్యతను పరిశీలించిన కమిషనర్, ప్రజలకు త్రాగునీటి నాణ్యతపై వివరాలు తెలియజేశారు. డ్రైనేజ్ సమస్యలపై కూడా స్థానికుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను ఇంచార్జ్ కమిషనర్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ అల్పాహారం తీసుకుంటున్న ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అల్పాహారం ద్వారా సరఫరా చేస్తున్న పూరీలు సరిగ్గా వండటం లేదని, పచ్చిగా ఉండటంపై ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన ఇంచార్జ్ కమిషనర్, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ కమిషనర్ సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ, కాకినాడ నగరంలో ప్రతిరోజూ డివిజన్‌ల వారీగా పర్యటనలు చేపట్టి, అక్కడ ఎదురయ్యే సమస్యలకు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ డివిజన్ పర్యటనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఇంచార్జ్ ఇంచార్జ్ కమిషనర్ పేర్కొన్నారు.

ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, డిఈ లు ప్రవీణ్ చాంద్, ఏఈ అర్జున్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## నేడు కాకినాడలో గ్రంథాలయ సంస్థ పింఛనుదారుల సర్వసభ్య సమావేశం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛనుదారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జనవరి 23, శుక్రవారం నేటి ఉదయం 10 గంటలకు కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరగనుంది. ఈ సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారని సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.సాయి సత్య నారాయణ తెలిపారు.

**సమావేశ ముఖ్యాంశాలు:**

– వినతిపత్రం సమర్పణ: పింఛనుదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి, చైర్మన్ మరియు కార్యదర్శికి వినతిపత్రం అందజేయనున్నారు.

– లైఫ్ సర్టిఫికెట్లు: పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను నేడు నేరుగా కార్యాలయంలో సమర్పించే అవకాశం కల్పించారు.

– సీనియర్లకు సత్కారం:వృద్ధాప్యంలో ఉన్న సీనియర్ పింఛనుదారులను అతిథుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించనున్నారు.

– ఆత్మీయ సమ్మేళనం: సభ్యులందరూ కలిసి యోగక్షేమాలు చర్చించుకున్న అనంతరం, మధ్యాహ్న భోజనంతో కార్యక్రమం ముగియనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న పింఛనుదారులందరూ ఈ సమావేశానికి విధిగా హాజరుకావాలని ప్రధాన కార్యదర్శి సాయి సత్యనారాయణ కోరారు.

# ఉపాధ్యాయునికి ఆత్మీయ వీడ్కోలు

**– విద్యార్థులు, గ్రామస్తుల సమక్షంలో ప్రత్యేక సన్మాన సభ**
**– భావోద్వేగానికి గురైన విద్యార్థులు, స్థానికులు**



**ఎటాపాక, మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయ వృత్తి అన్నింటికన్నా గొప్పదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే మహోన్నత వ్యక్తులని పీఎంసీ చైర్మన్ సారంగి సాయిసుధాకర్ అన్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం గన్నేరుకొయ్యపాడు ఎంపీపీ పాఠశాలలో గత ఐదేళ్లుగా పనిచేసి ఇటీవల బదిలీ ఐన ఉపాధ్యాయుడు నవీన్ ను పాఠశాల యాజమాన్య కమిటీ, విద్యార్థులు, గ్రామస్తులు గురువారం ప్రత్యేక ఆత్మీయ వీడ్కోలు సన్మాన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి, జ్ఞాపికతో పాటు గిఫ్ట్ అందించారు. ఈ సందర్భంగా స్థానికులు, పీఎంసీ కమిటీ సభ్యులు మాట్లాడారు. సమాజంలో చదువుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యార్థులను సన్మార్గంలో నడుపుతూ వారి భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులన్నారు. విద్యార్థికి గురువే నిఘంటువు అని గుర్తు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీరు, డాక్టర్ ఎవరైనా ఓ ఉపాధ్యాయుడి ద్వారా జ్ఞానాన్ని పొంది నవాళ్లే అన్నారు. గురువు విద్యార్థులను మంచి పౌరులుగా చెక్కే శిల్పులన్నారు. సమసమాజ స్థాపనలో కీలకమైన వ్యక్తులు ఉపాధ్యాయులేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని సుమశ్రీ, అశోక్, స్పందన, సౌజన్య, అంగన్వాడీ కార్యకర్త అచ్చమాంబ, సహాయకులు సుస్మిత, సుభాషిణి, రమేష్, పద్మ, పుష్ప, లక్ష్మీ, రమ్య, దుర్గ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యానాం బీచ్ ఫెస్టివల్‌పై అసత్య ఆరోపణలు తగవు

**– ఎమ్మెల్సీ ఇజ్రాయెల్‌పై జనసేన నేత గుర్రం కృష్ణ ఫైర్**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా యానాంలో కనీవినీ ఎరుగని స్థాయిలో ఆంధ్రా గోవా కోకో బీచ్ ఫెస్టివల్ జరిగిందని, దీనిని జీర్ణించుకోలేని వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్ అసత్య ఆరోపణలు చేస్తూ అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావుపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని జనసేన నాయకుడు గుర్రం కృష్ణ (జీ కే) విమర్శించారు. యానాం సంక్రాంతి సంబరాల ముసుగులో అవినీతి జరిగిందన్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి పండుగ అయిన సంక్రాంతి మూడు రోజులుపాటు ఈ ప్రాంత ప్రజలకు ఆటవిడుపుగా ఆహ్లాదాన్ని, సంతోషాన్ని పంచాలన్న ఉద్దేశ్యంతో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఎంతో శ్రమించి యానాం సముద్ర తీరంలో భారీస్థాయిలో ఫెస్టివల్ నిర్వహించారని, ఎంతో వ్యయ ప్రయాసలతో నిర్వహించిన ఈ మూడు రోజుల కార్యక్రమానికి కేవలం అమలాపురం నియోజకవర్గం నుంచే కాక జిల్లావ్యాప్తంగా ప్రజలనుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. అందుకే బీచ్ ప్రాంతం అంతా లక్షలాది మందితో నిండిపోయి మూడు రోజుల పాటు ఎంతో సంతోషంగా గడిపారన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ గతంలో కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తూ యువతులతో అసభ్య నృత్యాలు చేసిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆ వీడియోలు నేటికీ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయన్నారు.

బీచ్ ఫెస్టివల్ విజయవంతం అవ్వడంతో ఓర్వలేకనే ఈ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

సంక్రాంతి సంబరాలు నిర్వహణ ఖర్చులన్నీ పారదర్శకంగా జరిగాయని, ఈ కార్యక్రమ బాధ్యతలన్నీ ఆ గ్రామస్తులతో చేసిన కమిటీ నిర్వర్తించిందని, దీనిని ఎమ్మెల్యే ఆనందరావుకు ఆపాదించడం దారుణమన్నారు. ఆనందరావుపై చేసిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నది ప్రజలకు బాగా తెలుసు అన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు కటికిరెడ్డి బాబి, నల్లా రాము, కుంచె విజయ్, ఈలి వెంకటేష్, పిండి గణపయ్య, ఈచంట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నల్లరాయి క్వారీల వల్ల నష్టం జరుగుతున్నా పట్టించుకోరా?



**– రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు బాధితులు ఫిర్యాదు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం నర్సాపురం నల్లరాయి క్వారీల వలన ప్రజలకు నష్టం జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ విషయంలో బాధితులకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జి రెడ్డికి గిరిజన మహిళ పోడియం అరుణకుమారి, క్వారీ బాధితులు వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేసారు. నరసాపురం గ్రామంలో నల్లరాయి క్వారీలకు సంబంధించి గురువారం అధికారులు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డికు నరసాపురం, దిరిసినపల్లి గ్రామానికి చెందిన క్వారీ వల్ల నష్టపోతున్న బాధితులు తమకు న్యాయం చేయాలంటూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు వారికి జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ నల్లరాయి క్వారీల వలన ఇళ్ళు బీటలు వారుతున్నాయని, టీవీలు పగిలిపోతున్నాయని, పంట పొలాలు పాడైపోతున్నాయని తెలియజేశారు. అంతేకాక ఎటువంటి హెచ్చరికలు లేకుండా విచ్చలవిడిగా బ్లాస్టింగ్ చేయడం వలన చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తెలియజేశారు. బ్లాస్టింగ్ వల్ల పొగ దుమ్ము ధూళి వెదజల్లుతుందని తెలియజేశారు. బ్లాస్టింగ్ సమయంలో విపరీతమైన చెడు వాసన వస్తుందని ఆవేదన వ్యక్తంచేసారు. 9నెలలుగా క్వారీ వల్ల జరుగుతున్న నష్టాలు గురించి ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఎటువంటిన్యాయం జరగడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేసారు. ప్రస్తుతనడుస్తున్న క్వారీలు గిరిజనేతరులే నడిపిస్తున్నారని, నిజంగా ఆదివాసులుక్వారీ యజమానులుగా ఉంటే నాన్ ట్రైబల్స్ ఎందుకు క్వారీలో ఉంటున్నారని వారు తెలియ జేశారు. క్వారీ వల్ల వచ్చే ఆదాయంలో అవకతవకలు జరుగుతున్నాయని నిధులు దుర్వి నియోగంజరుగుతున్నాయని, బినామీపేరుతో క్వారీలు నిర్వహించబడు తున్నాయని వీటన్నిటిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని వారి ఈ సందర్భంగా సందర్భంగా కోరారు. ఎస్టీ కమిషన్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో పోడియం అరుణకుమారి, కోటం పండమ్మ, చిట్టిబాబు, దుర్గ భవానీ, గంగాభవానీ, దేవి, శ్రీదేవి, బాధితులు ఉన్నారు.

# అనధికార లేఅవుట్‌లపై కఠిన చర్యలు

**- పంచాయతీల్లో వారం రోజుల్లో గుర్తింపు -నోటీసులు జారీ**
**- రుడా చైర్ పర్సన్ బొడ్డు వెంకటరమణ**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రుడా చైర్ పర్సన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో, వైస్ చైర్ పర్సన్ వై. మేఘ స్వరూప్, ఐఏఎస్ సూచనల మేరకు గురువారం రుడా కాన్ఫరెన్స్ హాల్‌లో రుడా పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పెనలైజేషన్ స్కీమ్ (బిపిఎస్) అమలుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనధికార లేఅవుట్‌లు, కట్టడాలపై అమలులో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనధికార లేఅవుట్‌ల వల్ల ప్రజలకు, సమాజానికి కలిగే నష్టాలు, డెవలప్‌మెంట్ ఛార్జీల రూపంలో పంచాయతీలు కోల్పోతున్న ఆదాయం, తద్వారా మౌలిక వసతుల కల్పనకు ఏర్పడుతున్న అడ్డంకులపై చైర్ పర్సన్ వివరించారు. రాబోయే వారం రోజుల్లో ప్రతి పంచాయతీ పరిధిలోని అన్ని అనధికార లేఅవుట్‌లను గుర్తించి, ఏపీ ఎంఆర్‌యుడిఏ చట్టం-89 ప్రకారం ప్రొవిజనల్ ఆర్డర్, కన్ఫర్మేషన్ ఆర్డర్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.సరిహద్దు రాళ్లు తొలగించడం, అనధికార రోడ్లను తొలగించడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులు మరియు ముఖ్య ప్రదేశాల్లో అనధికార లేఅవుట్ వివరాలు ప్రదర్శించడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. అమలు తీరును ప్రత్యేక బృందాలతో తనిఖీ చేసి, నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. లేఅవుట్ డెవలపర్లు, ప్రజలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో చేపట్టిన చర్యలపై వివరాలు వెల్లడించారు.రుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జి.వి.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ, ఇప్పటికే గుర్తించిన అనధికార లేఅవుట్‌ల వివరాలు తెలియజేస్తూ తదుపరి కార్యాచరణ ప్రణాళికను వివరించారు. సర్వే నెంబర్ల ఎఫ్ఎంబిలు, అడంగల్ కాపీలు, రఫ్ స్కెచ్‌లు, రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు సమర్పించి రుడా కార్యాలయం ద్వారా రెగ్యులరైజేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అనధికార లేఅవుట్‌లలోని రోడ్లను స్వాధీనం చేసుకోరాదని, అక్కడ భవన నిర్మాణ అనుమతులు ఇవ్వరాదని స్పష్టం చేశారు.

రుడా ప్లానింగ్ ఆఫీసర్ నార్కెడిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, బిల్డింగ్ ప్లాన్ రిజిస్టర్, అనధికార కట్టడాల రిజిస్టర్, అనధికార లేఅవుట్ రిజిస్టర్‌ల నిర్వహణపై వివరించారు. పంచాయతీల్లో నిర్మాణ అనుమతులు 'పిఆర్ఐఎస్' యాప్ ద్వారా మాత్రమే జారీ చేయాలని సూచించారు.ఆర్‌డిడిటిపి జి.సుబ్బారావు మాట్లాడుతూ, ఏపీ ఎంఆర్‌యుడిఏ చట్టంపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రుడా మార్గదర్శకాలను పాటిస్తూ ఆర్థిక ప్రతిపత్తి పెంపుతో పాటు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో రుడా సెక్రెటరీ ఎంవీఆర్ సాయి బాబా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్. ప్రశాంత్‌తో పాటు ఇతర ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# 24 నుండి ప్రారంభం కానున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు జనవరి 24 నుండి 26వరకు పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి (దివిలి)లో జరగనున్నాయి. వీటి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయని, స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ అధ్యక్షులు గొందేసి రాజా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ప్రతీరోజు 3 ప్రదర్శనలుగా నాటిక పోటీలు జరుగుతాయని, 24వ తేదిన విజయవాడ వారి మమ్మల్ని బ్రతకనివ్వండి, హైదరబాద్ వారి గేమ్, కొలకలూరి వారి జనరల్ బోగీలు, 25వ తేది వైజాగ్ వారి అసత్యం, కాకినాడ వారి ఆచమనం, చిలకలూరిపేట వారి మాఇంటిలో మహాభారతం, 26వ తేదిన హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, గుంటూరి వారి ఇది అతని సంతకం, ప్రత్యేక ప్రదర్శన స్నేహ ఆర్ట్స్ వారి ప్రదర్శనలు ఉంటాయని, ఈ పోటీలు విజయవంతానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రతీరోజు రాత్రి 7 గంటలకు ఈ




పోటీలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఎస్.ఆర్.స్వామి, కేదారి నాగు, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, పాలాని సత్తిబాబు, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారులను చులకన చేయడం సరికాదు



**- ఎమ్మెల్సీ వ్యాఖ్యలపై చాంబర్ ఆఫ్ కామర్స్**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సంక్రాంతి సందర్భంగా ఎస్.యానంలో ఆంధ్రా గోవా బీచ్ వద్ద నిర్వహించిన సంక్రాంతి సంబరాలపై ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ తీవ్రంగా ఖండించింది. వ్యాపారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఎమ్మెల్సీ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోనసీమకే తలమానికంగా అంగరంగ వైభవంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాల విజయాన్ని జీర్ణించుకోలేకనే వైసీపీ శ్రేణులు ఎమ్మెల్యే ఆనందరావుపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపారులను అవమానించేలా మాట్లాడటం సరైన పద్ధతి కాదని, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ సలహాదారులు కంచిపల్లి అబ్బులు, కార్యదర్శి కొమ్ముల వెంకటాచల ప్రసాద్, రాష్ట్ర బులియన్ అసోసియేషన్ కోశాధికారి, ఛాంబర్ సభ్యులు శేట్ అనిల్ కుమార్, వెండి-బంగారు వర్తక సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, టిడిపి నేతలు వలవల శివరావు, చిక్కాల ముద్దుబాబు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి

**- సిఐ విజయశంకర్, ఎస్సై మౌనికలు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డిఎస్‌పి డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో సిఐ పి.విజయశంకర్, ఎస్సై వి.మౌనికలు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజల సహకారంతో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం పెద్దాపురం పట్టణంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుండి గుర్రాల సెంటర్ వరకు ప్రత్యేక హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది అందరూ హెల్మెట్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. సిఐ విజయశంకర్, ఎస్సై మౌనికలు తెలుపుతూ, హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలు, ద్విచక్ర వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించవలసిన అవసరం, హెల్మెట్ వాడకం వలన ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు నివారించడంలో హెల్మెట్ ధరించడం గురించి, ప్రజలలో చైతన్యం తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం

**- ఇఇ ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ఐడిఏ మరియు పాండవుల మెట్ట వద్ద, సబ్ స్టేషన్‌లలో మరమ్మత్తులలో భాగంగా ఈ నెల 24వ తేది శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణ పరిధిలో ఫామ్‌టెక్ ఫీడర్ మరియు ఎడిబి రోడ్డు మీద ఉన్న ఇండస్ట్రీయల్ సర్వీసెస్, పాండవుల మెట్ట దగ్గర హౌసింగ్ కాలనీ, కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాలకు మరియు వ్యవసాయ సర్వీసెస్‌లకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, కావున విద్యుత్ వినియోగదారులందరూ సహకరించవలసినదిగా పెద్దాపురం ఎలక్ట్రికల్ ఇఇ ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు.

## ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్‌కు ఎఎస్సైలుగా పదోన్నతి

**- అభినందించిన సిఐ విజయశంకర్, ఎస్సై మౌనికలు**




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుల్‌లకు కాకినాడ జిల్లా ఎస్‌పి జి.బిందుమాధవ్ ఉత్తర్వుల మేరకు ఎఎస్సైలుగా పదోన్నతి పొందినట్లు సిఐ విజయశంకర్, ఎస్సై వి.మౌనికలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ మౌలానా, జి.సూర్యనారాయణమూర్తి (ట్రైసన్)లకు ఎఎస్సైలుగా పదోన్నతి పొందారని వారు తెలిపారు. దీనిలో భాగంగా గురువారం పెద్దాపురం సర్కిల్ కార్యాలయంలో సిఐ విజయశంకర్ ఆధ్వర్యంలో ఎస్సై వి.మౌనిక పర్యవేక్షణలో పదోన్నతి పొందిన ఎఎస్సైలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సైలు సత్తిబాబు, నారాయణ, రైటర్ పి.సురేష్, కానిస్టేబుల్స్ శేషు, రాజనాల శ్రీను, పెంకే శ్రీను, పలువురు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డులు





కాకినాడ, మేజర్ న్యూస్ : నిపుణుల బృందం సిఫార్సు మేరకు వెలివెల రమేష్, నందూరి సుజాత మరియు గాత్రం మహేష్‌లు సమర్పించిన సిద్ధాంత వ్యాసాలు జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందాయి. వెలివెల రమేష్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోను, నందూరి సుజాత మ్యాథమెటిక్స్ విభాగంలోను మరియు గాత్రం మహేష్‌కి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలోను పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డులు లభించాయి. వెలివెల రమేష్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'ఏన్ ఇన్వెస్టిగేషన్ ఆన్ సిస్మిక్ రెస్పాన్స్ ఆఫ్ ఫ్రేమ్డ్ ఎలివేటెడ్ వాటర్ ట్యాంక్ స్టేజింగ్స్ విత్ రిజిడ్ లింక్స్ – ఏన్ అనలిటికల్ అప్రోచ్ విత్ ఎక్స్‌పెరి మెంటల్ వాలిడేషన్'ను విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా.బి.పాండురంగరావు మరియు కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా.వి.రవీంద్ర ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

నందూరి సుజాత సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'పర్ఫార్మెన్స్ అనాలిసిస్ ఆఫ్ క్యూస్ విత్ సింగిల్ అండ్ మల్టిపుల్ ఫ్రాక్షనల్ ఆర్డర్ సర్వర్స్'ను కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) మ్యాథమె టిక్స్ ప్రొఫెసర్ డా.జి.వి.ఎస్.ఆర్.దీక్షితులు ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు. గాత్రం మహేష్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'డిజైన్ అండ్ పర్ఫార్మెన్స్ అనాలిసిస్ ఆఫ్ వైడ్‌బ్యాండ్ మైక్రోస్ట్రిప్ యాంటెన్నాస్ యూజింగ్ మెటామటీరియల్స్ ఫర్ వైర్లెస్ అప్లికేషన్స్' ను కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభా గం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.రాజశేఖర్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# పలు ప్రభుత్వ కార్యాలయాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



### – బ్రహ్మరథం పట్టిన కార్యకర్తలు

**కూనవరం, మేజర్‌న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలంలోని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి పర్యటనలో భాగంగా గురువారం కూనవరం మండలంలోని కూటూరు గ్రామపంచాయతీ సచివాలయం నూతనంగా నిర్మించబడిన సచివాలయాన్ని ప్రారంభించడం జరిగింది. అలాగే ముల్లూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అచ్చే సత్యనారాయణ ప్రమాదం చేత మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. అనంతరం ఆర్కుర్ గ్రామంలో బూత్ ఇన్చార్జి రాము ప్రమాదం జరుగగా బాధితుడిని పరామర్శించడం జరిగింది. అనంతరం చినార్కూర్ పంచాయతీలో సచివాలయం ప్రారంభించడం జరిగింది. అనంతరం కొండరాజుపేట సచివాలయం ప్రారంభించడం జరిగింది. అనంతరం కూనవరం పంచాయతీ సచివాలయం ప్రారంభించడం జరిగింది. అనంతరం జగ్గవరం పంచాయతీలోని కుంజ వీరబాబు మృతి చెందడం జరిగింది. వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. తర్వాత కూనవరం మేజర్ పంచాయతీ సచివాలయం భవనాన్ని ప్రారంభించడం జరిగింది. తదనంతరం కూనవరం పంచాయతీలో టేకుల బోరు గ్రామంలో సినిమా హాలు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగింది. సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి పోలవరం సమస్యలపై నాయకులు కార్యకర్తలు ప్రజలు అడగగా నేనున్నాను ప్యాకేజీ వచ్చే విధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు మండలంలోని ప్రాజెక్టు మునిగే గ్రామాలన్నిటికి ప్యాకేజీ వచ్చే విధంగా సీఎంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని కూటమి ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. చంద్రబాబు నాయుడు విజనున్న నాయకుడు కావున మీరు ఎవరు అధైర్య పడవద్దు అని హామీ ఇవ్వడం జరిగింది.

# రహదారి నిర్మాణం చేపట్టకపోతే ఆత్మత్యాగానికైనా సిద్ధం

### – ఆదివాసి గిరిజన సంఘం నాయకులు లోతా రామారావు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండల పరిధిలోని రమణయ్యపేట గ్రామం నుండి జె అన్నవరం వరకు ఉన్న 11 కిలోమీటర్ల రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే నరకానికి అధికారికంగా పాస్పోర్ట్ తీసుకున్నట్టే గత పది సంవత్సరాలుగా ఇదే పరిస్థితిలో ఉన్న ఈ రోడ్డును నిర్మించాలంటూ పలు పార్టీల నాయకులు కానీ, ప్రజాసంఘాల వారు గాని, చేయని ధర్నా లేదు తెలుపని నిరసన లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ధర్నా చేసి నిరసన తెలియజేసిన ఆదివాసి గిరిజన సంఘం నాయకులు లోతా రామారావు మరల మరోసారి రోడ్డు కోసం మహా ధర్నా అంటూ నిరసన దీక్ష కై ఇటీవల పిలుపు నివ్వడం జరిగింది. గురువారం రమణయ్యపేట నుండి జె అన్నవరం వరకు గల రోడ్డు నిర్మాణం కొరకు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలన మారుతుంది కానీ, ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న గిరిజనుల పరిస్థితి మాత్రం మారటం లేదన్నారు. గిరిజనుల ప్రాణాలు అంటే, ప్రభుత్వానికి లెక్క లేదా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై హాస్పిటల్‌కు వెళ్లాల్సి వచ్చి ప్రయాణిస్తున్న గర్భిణులు, గుంతల మయమైన రోడ్డు వల్ల దారిలోనే అబార్షన్ పాలు అవుతున్నారని, ఆయన వాపోయారు. ఎప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని దీనిపై ప్రాణమా త్యాగానికి కైనా సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. రాజవొమ్మంగి జడ్పిటిసి జ్యోతి మాట్లాడుతూ నాలుగు గిరిజన మండలాలకు ముఖ ద్వారమైన ఏలేశ్వరం నుండి ప్రత్తిపాడు, పోలవరం నియోజకవర్గాలను కలిపే రహదారి పూర్తిగా శిథిలమై గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతుంటే ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు కలిపి రహదారి విషయంలో ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అధికారంలో లేనప్పుడు ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ ఇదే రహదారిపై గోడను నిర్మించడం మరోసారి గుర్తు చేశారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రోడ్డు పునర్నిర్మాణం వెంటనే ప్రారంబించకపోతే ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉంటుందని అన్నారు. కాగా ధర్నా కార్యక్రమం వల్ల రోడ్డు స్తంభించి బస్సులు ఆటోలు నిలిచిపోయాయి. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి సర్పంచ్ మురళి, చికిలింత సర్పంచ్ కొండల సూరి బాబు, కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాథం, గడుఓకుర్తి సర్పంచ్ చంద్రుడు, గిరిజన సంఘం జిల్లా నేత జిల్లా నేత మట్ల వాణిశ్రీ, నాలుగు మండలాల గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెద్దాపురం డిఎస్పి శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ఏలేశ్వరం ప్రత్తిపాడు, అన్నవరం, జగ్గంపేట, రౌతులపూడి ఎస్సైలు తమ సిబ్బందితో పాల్గొని బందోబస్తు నిర్వహించారు.

## సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

### – రాష్ట్ర ఎస్‌టి కమీషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం తరఫున అధికారులు వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి ఆదేశించారు. పోలవరం జిల్లా రంపచోడవరం మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ సచివాలయాలను రాష్ట్ర ఎస్‌టి కమీషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ సమావేశంలో పాల్గొని, క్వారీ భూముల సమస్యపై గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పోక్స్ పేట గ్రామ సచివాలయాన్ని సందర్శించి, స్థానిక అధికారులతో సమావేశమై గ్రామ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆతర్వాత కె.ఎర్రంపాలెం గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడుతూ వారి లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. విద్య పట్ల ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండటంతో పాటు సరైన సాధన అవసరమని సూచిస్తూ, విద్యార్థులు తమ నోట్ బుక్స్‌పై వారి లక్ష్యం రాసుకోవాలని ప్రోత్సాహించారు. ఊట్ల గ్రామంలోని యూపీ స్కూల్‌ను సందర్శించారు. అనంతరం అక్కడి అంగన్?వాడీ కేంద్రాన్ని బొజ్జిరెడ్డి పరిశీలించారు. గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న పోషకాహారం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్ వాడీ భవనం శిథిలావస్థలో ఉందని, నూతన భవనం నిర్మించాల్సిందిగా స్థానికులు చైర్మన్ ను కోరారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. అదే విదంగా బి.వి.కోట గ్రామంలోని సచివాలయ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించి వారి విధి నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలపై ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం తరఫున అధికారులు వెంటనే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## పిఠాపురం గ్రంధాలయం ఆకస్మిక తనిఖీ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతి రాజు ఈశ్వర రాజు వర్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా పాఠకులు ఏఏ విభాగాలను ఎంతమంది వినియోగించుకుంటున్నారని గ్రంథపాలకుడు ఆర్ .వెంకట రాముని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుస్తకాల ర్యాకులను, గ్రంథాలయంలో లభ్యమయ్యే వివిధ పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయానికి సొంత భవన నిర్మాణానికి పురపాలక సంఘ అధికారులను కలిసి స్థల సేకరణ చేయాలని సూచించారు. పిఠాపురం పట్టణంలో పాఠశాలలకు దగ్గరగా ప్రభుత్వ గ్రంథాలయం ఉన్నందున పాఠశాలల విద్యార్థులు అందరూ గ్రంథాలయ సేవలను వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని గ్రంథాలయాధికారిని ఆదేశించారు. అనంతరం గ్రంధాలయ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రేపాక వెంకట రాము, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ నిరసన



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** జడ్డంగి అన్నవరం నుండి రమణయ్యపేట వరకు ఉన్న ప్రధాన రహదారి నిర్మాణం తక్షణమే చేపట్టాలంటూ గురువారం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పోలవరం జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం శాతవిధాల నిర్వీర్యం చేయాలని ప్రతిరోడ్లోనూ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలను నిరసన కార్యక్రమాలకు రాకుండా నిర్బంధనాలకు గురి చేశారు. అయినా రోడ్డుపై వాహనదారులు వారు పడుతున్న ఇక్కట్లకు లోతా రామారావు చేపట్టిన నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజలు హాజరయ్యారు. రాజవొమ్మంగి జడ్పిటిసి ఒడుగుల జ్యోతి మరియు సర్పంచులు ఎంపీటీసీ సంఘీభావం తెలిపారు. ప్రాణాలు పోతున్న పట్టించుకోరా సార్ అంటూ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అంటూ రోడ్డును వెంటనే వేయాలని ప్రాణాలు కాపాడవలసిన వాళ్లే శిక్షిస్తారా అంటూ నినాదాలు చేస్తూ రోడ్డు పనులు ప్రారంభించే వరకు కూడా నిరసన కార్యక్రమాన్ని విరమించేది లేదంటూ లోతరామారావు అన్నారు. ఆయన వెంట గిరిజన సంఘం నాయకులు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఆపేది లేదంటూ రోడ్డుపై నిరసన చేపట్టారు అయితే కాకినాడ జిల్లాకు చెందిన పోలీసు వర్గాలు ఏలేశ్వరం, ప్రత్తిపాడు, అన్నవరం, జగ్గంపేట ఎస్సైలు, సిఐలు పెద్దాపురం డిఎస్పి నిరసన కార్యక్రమం వద్దకు రావడం జరిగింది. ప్రాణాలు కాపాడమంటే మా నిరసన కార్యక్రమాన్ని ఆటంకపరచడం ఎంతవరకు న్యాయమని రామారావు ప్రశ్నించారు. ఏలేశ్వరం తాసిల్దార్ కుశరాజు లోతా రామారావుతో చర్చలు జరుపుటకు రాగా గత మూడుసార్లుగా ఇదేవిధంగా జరుగుతుందని మేము ఎవరిని ఇబ్బందికి గురి చేయమని మాకు రోడ్డు నిర్మాణం చేసే వరకు నిరసన కార్యక్రమాన్ని నిలిపేదే లేదని జిల్లా స్థాయి అధికారులు కానీ ప్రజాప్రతినిధితో గాని నిర్దిష్టమైన హామీని ఇప్పించాలని లోతారామారావు కోరడం జరిగింది. ఏలేశ్వరం తాసిల్దార్ కుశరాజు ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన వెనుతిరిగి వెళ్ళడం జరిగింది. నిరసన కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుంది.

# యూరియా అధిక ధరలకు విక్రయించరాదు

**– జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎన్.విజయ్ కుమార్**

**పిఠాపురం,మేజర్ న్యూస్ :** యూరియా అధిక ధరలకు విక్రయించరాదని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఎన్.విజయకుమార్ హెచ్చరించారు. పిఠాపురం మండలం మల్లం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రాన్ని గురువారం సందర్శించి యూరియా నిల్వలు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎరువుల విక్రయ డీలర్లతో మాట్లాడుతూ... యూరియా అధిక ధరలకు విక్రయించరాదని హెచ్చరించారు. యూరియా అధిక మోతాదులో వాడడం వల్ల పురుగుల మరియు తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని, అందువల్ల సిఫారసు చేసిన మోతాదులు మాత్రమే వాడాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ గురుకులం పాఠశాల జగ్గయ్య చెరువు, పిఠాపురంలో 60 మంది విద్యార్థినులకు భూసార పరీక్ష దాని ఆవశ్యకత, మట్టి నమూనా తీసే విధానము శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



పిఠాపురం వ్యవసాయ సంచాలకులు పి. స్వాతి, భూసార పరీక్ష కేంద్రం సామర్లకోట వ్యవసాయ అధికారి పవిత్ర, మండల వ్యవసాయ అధికారి గంగాధర్ మరియు ఏఈఓ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ మోసాలపై నిరంతర పోరాటం



**– మాజీ ఎమ్మెల్యే సత్తి**

**– పార్టీ నాయకులు కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని పిలుపు**

**అనపర్తి, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తుందని, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలు, మాయమాటలపై నిరంతరం పోరాడుతూనే పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం అనపర్తి వైఎస్సార్సిపి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పార్టీ సంస్థ గత నిర్మాణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్సిపి పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గస్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కంప్లీట్ అయ్యే ఏర్పాటు ప్రక్రియ జరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు సృష్టించినా, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజల ఆశీర్వాదం, దైవ అనుగ్రహం మనకు ఉన్నంతకాలం మనల్ని ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు.

రానున్న రోజుల్లో తప్పనిసరిగా ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని, పార్టీ శ్రేణుల అంకితభావం, నిరంతర కృషి వల్లే విజయం సాధ్యమవుతుందని అన్నారు. ఇకపై కూడా, పార్టీ తరఫున ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలపై సాగే ప్రతీ పోరాటంలో మన అనపర్తి నియోజకవర్గం ఎప్పుడూ ముందుండాలని అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, రాజమండ్రి పార్లమెంట్ పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు తిప్పల గురుమూర్తి రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, పార్టీ అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు గుబ్బల తులసీకుమార్, రాజమండ్రి సిటీ, గోపాలపురం నియోజకవర్గాల పరిశీలకులు అద్దంకి ముక్తేశ్వరావుతదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## సేంద్రీయ ఎరువులతో రసాయనిక ఎరువులకు కళ్లెం



పెరవలి, మేజర్ న్యూస్ : రోజు రోజుకు పెరుగుతున్న పొటాస్ ధరలకు బదులుగా సేంద్రీయ పొటాష్ రైతులకు అందుబాటులోకి వచ్చినట్లు వచ్చిందని మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ అన్నారు. పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామంలో కోటిపల్లి రత్నాకర్ వ్యవసాయ క్షేత్రంలో జనవరి 22వ తేదీ గురువారం కంపెనీ ఉచితంగా అందజేసిన సేంద్రీయ పొటాష్‌ను రైతులచే వ్యవసాయ క్షేత్రంలో చల్లించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మోతాదుకు మించి ఉపయోగించడం వల్ల పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల కోట్లాది రూపాయలు విదేశీ మారకద్రవ్యం కూడా ఆదా అవుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ మద్రాస్ ఫెర్టిలైజర్స్ విజయ ఎరువుల బ్రాండ్ పేరుతోనే ఈ సేంద్రియ ఎరువును తీసుకొచ్చినట్లు సంస్థ జిల్లా అడిషనల్ మేనేజర్ టి.కిషోర్ బాబు వెల్లడించారు. రసాయనక పొటాష్ 50 కిలోల బస్తా 1800 ధర ఉండగా సేంద్రియ పొటాష్ 550 రూపాయలకే వస్తుంది అన్నారు. మొలాసిస్‌తో తయారయ్యే సేంద్రీయ పొటాష్ నీటిలో కరిగించి పంటకందించే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధికృత డీలర్ కె.శ్రీనివాస్, రైతులు కోటిపల్లి కాశీ విశ్వేశ్వరరావు, మల్లేశ్వరరావు, ముత్యాల సాంబమూర్తి, కృష్ణమూర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ పితామహుల జయంతి వేడుకలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** ముక్కామల శ్రీ ఇనుపకోళ్ల రాఘవరావు మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో జనవరి 22వ తేదీ గురువారం ఆంధ్ర పితామహులు రచయిత శ్రీ మాడపాటి హనుమంతరావు మరియు గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యదేవర కాళేశ్వరరావు యొక్క జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించి మాడపాటి హనుమంతరావు ఆంధ్ర ఉద్యమం గ్రంథాలయాల అభివృద్ధి కొరకు అయ్య దేవర కాళేశ్వరరావు గ్రంథాలయ ఉద్యమం స్వాతంత్రోద్యమం కొరకు చేసినటువంటి విశేషాలను తూర్పుగోదావరి జిల్లా పంచాయతీరాజ్ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ గద్దె వీరస్వామి విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## కార్యకర్తల సమన్వయంతో ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేసిన టిడిపి మండల అధ్యక్షుడు భాస్కర్



**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం మండలంలో గురువారం నాడు నిర్వహించిన సభను దిగ్విజయం చేయటంలో కార్యకర్తల కృషి మరువలేనిదని టిడిపి మండల అధ్యక్షులు ఏడవల్లి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు సీఎం దూరదృష్టతో ఆలోచించి ఈ ప్రాంత ప్రజలకు ప్రధానంగా నిర్వాసితులకు స్ట్రక్చర్ వేల్యూ సొమ్మును ఎకౌంట్లో జమ చేయటమే కాకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో కూడా త్వరితగతిని నిర్వాసితులకు జమ అయ్యే సూచనలు కనపడుతున్నాయని ఇచ్చిన హామీని అమలు చేసి ప్రజల మన్నలను పొందాలని రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందటానికి చంద్రబాబు ప్రభుత్వం గట్టిగా పని చేస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రాంత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి నిర్వాసితుల కోసం కృషి చేస్తామని తెలిపారు.

# తూర్పు కాపుల ఓబీసీ రిజర్వేషన్ల అమలుపై కలెక్టర్‌కు కృతజ్ఞతలు

**- కాకినాడ జిల్లా కలెక్టర్ అపూర్ భరత్ కలిసిన సంఘం నాయకులు**
**- రిజర్వేషన్ల ఆర్డర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**
**- కుల గణన నిర్వహించాలని ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ లోపింటి చిరంజీవి డిమాండ్**



**కాకినాడ, మేజర్ న్యూస్:** తూర్పు కాపుల ఓబీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టతనిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు గాను కాకినాడ జిల్లా కలెక్టర్ గౌరవనీయులు శ్రీ అపూర్ భరత్ గారిని తూర్పు కాపు సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.
ఆర్డర్ అమలుపై గ్రామస్థాయిలో చర్యలు:
అనంతరం కాకినాడలోని హోటల్ శాంతి నివాస్‌లో మీసాల దుర్గారావు అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ లోపింటి చిరంజీవి మాట్లాడుతూ.. ఓబీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న సంఘం ప్రెసిడెంట్లు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. అలాగే జనాభా గణనతో పాటు కుల గణనను కూడా వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రాజకీయ, ఆర్థిక వెసులుబాటు కల్పించాలి:** తూర్పు కాపు సంఘ గౌరవ సలహా సభ్యులు పైలా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతంలో తూర్పు కాపులు రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర వెనుకబాటుతనానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా, ప్రభుత్వాలు తూర్పు కాపులకు సముచిత స్థానం కల్పిస్తూ నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు.

ఈ మీడియా సమావేశంలో తూర్పు కాపు విద్యా విజ్ఞానాభివృద్ధి సంఘం ఉభయగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు కునుకు హేమకుమారి, సెక్రటరీ పీల మహేష్, నాయకులు తాళ్లపూడి గణేష్, పాలూరి వీరబాబు, వెంపటపు శ్రీనివాస్, అలమండ నాగేంద్ర, నంద్ల చిరంజీవి, గేదెల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి భీమేశ్వరుని దర్శనం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి శ్రీస్వామి వారి దర్శనమునకు గురువారం విచ్చేసియున్నారు. శ్రీ స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం నంది మండపం నందు ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేసియున్నారు. అనంతరం ఆలయ అధికారి, దేవస్థానం చైర్మన్ కంటే జగదీష్ మోహనరావు(బాబు) శ్రీస్వామి వారి ప్రసాదములు, స్వామి వారి చిత్రపటం అందజేసియున్నారు. సదరు కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు, దేవస్థానం అర్చకులు, వేదపండితులు మరియు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొనియున్నారని తెలియపర్చుడమైనది. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో బళ్ళనీలకంఠం,ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

# జగన్మోహిని కేశవస్వామి నిత్యాన్నదాన పథకానికి విరాళం




ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి నిత్యాన్నదాన పథకానికి దొండపూడికి చెందిన మద్దాల నాగేంద్ర శ్రీలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకొని రూ.10,116లు విరాళంగా సమర్పించియున్నారు. దాతలకు అర్చకులు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. వీరికి ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# సామర్లకోట ఎంఈఓ-1గా లక్ష్మీ తులసి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం విద్యాశాఖ అధికారి 1గా అడబాల లక్ష్మి తులసి గురువారం బాధ్యతలు స్వీకరించారు . ఇప్పటివరకు ఎంఈఓ-1గా వై.శివరామకృష్ణయ్య విధులు నిర్వహించగా ఆయన డిసెంబర్ 31న పదవీ విరమణ చేయడంతో అప్పటి నుండి ఎంఈఓ వన్ పోస్టు ఖాళీగా ఉన్నది. ఈ నేపథ్యంలో ఏలేశ్వరం గవర్నమెంట్ హైస్కూల్లో ప్రధానోపాధ్యా యినిగా పనిచేస్తున్న అడబాల లక్ష్మి తులసిని సామర్లకోట మండల ఇన్చార్జ్ ఎంఈఓ-1గా లక్ష్మి తులసిని కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ ఉత్తర్వులు ప్రకారం గురువారం ఎంఈఓ-1గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా లక్ష్మి తులసి మాట్లాడుతూ సామర్లకోట మండల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. లక్ష్మి తులసి ఎంఈఓ-1గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎంఈఓ-2 పి పుల్లయ్య ఎంఆర్సి సిబ్బంది, ఎంపిడిఓ మరియు ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలిపారు.

# భద్రతకు ప్రాధాన్యం.. వసతి గృహాల్లో మెరుగైన వసతులు

**- ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై.మేఘాస్వరూప్ ఆదేశం**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరుపై ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై.మేఘా స్వరూప్ ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**ముఖ్యమైన చర్యలు:**

**-నిరంతర నిఘా:** జిల్లాలోని సీసీటీవీ కెమెరాలన్నీ నిరంతరం పనిచేసేలా చూడాలని, వాటిని లిరియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్‌తో అనుసంధానించి పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

**-తక్షణ మరమ్మతులు:** పనిచేయని కెమెరాలను వెంటనే బాగు చేయాలని, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

**-వసతి గృహాల పర్యవేక్షణ:** సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా స్థాయి అధికారులకు హాస్టళ్లను మ్యాపింగ్ చేశారు.

**-త్రాగునీటి సౌకర్యం:** అనపర్తి బీసీ హాస్టల్‌తో పాటు అన్ని వసతి గృహాల్లో శుద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల భద్రత, విద్యార్థుల సంక్షేమం విషయంలో రాజీ పడకుండా, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సంతృప్తి స్థాయిని పెంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# వివేకానంద సూచనలే యువతకు ఆదర్శం

**- పరిజ్ఞేయానందజీ మహారాజ్**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** స్వామి వివేకానంద సూచనలే నేటి యువతకు ఆదర్శమని, దేశాన్ని ప్రేమించమని వివేకానంద ఇచ్చిన పిలుపు యువత ఆదర్శంగా తీసుకోవాలని, సమాజానికి నిస్వార్థ సేవలు అందించడం ద్వారానే నిజమైన ఆనందం కలుగుతుందని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ అన్నారు. మండలంలోని దుప్పలపూడి ఆర్ వి ఆర్ కన్వెన్షన్ లో సమితి శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ముఖ్య అతిథి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్ అప్పాల ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి జ్ఞాన సంపాదన అందించే ఏకైక దేశం భారతదేశమని యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకుని వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మిమ్మల్ని సత్కరించడం అంటే వివేకానందనందుడుని సత్కరించినట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి అప్పాల ప్రసాద్‌ను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం స్వామి వివేకానంద జీవన సాఫల్య 2026 పురస్కార గ్రహీతలు హరియాణ పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకులు ఎస్ ఎల్ కనకరాజ్ గురు స్వామి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ శాఖ చైర్మన్ వైడి రామారావు, స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ మహారాజ్( శాక్తేయ సంప్రదాయకులు, శ్రీశ్రీశ్రీ అంబాత్రేయ క్షేత్ర వ్యవస్థాపకులు, బిజ్వార్)కు రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ చేతులు మీదుగా పురస్కారాలు అందజేశారు. పురస్కార గ్రహీతలకు నగదు, జ్ఞాపిక ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, ప్రముఖ పారిశ్రామికవేత్తలు తేతల ఉపేంద్ర రెడ్డి, మేడపాటి రామలింగారెడ్డి, సత్తి లక్ష్మణ రెడ్డి, సమితి కార్యవర్గానికి చెందిన సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందర రామారెడ్డి, ఎం.దుర్గాప్రసాద్, తాడి చంద్రశేఖర్ రెడ్డి, లెఫ్ట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్చువల్ వి.సిలో పాల్గొన్న ఎంపిడిఓ సూర్యనారాయణ



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** సిఇఓ - సెర్ప్‌వారి ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో అన్ని సచివాలయాల పిడిఓలతో నిర్వహించిన వర్చువల్ మీటింగులో ఎంపిడిఓ కె.వి.సూర్య నారాయణ,మండల స్వర్ణ గ్రామాధికారి వై.శ్రీహరిలు పాల్గొన్నారు. దీనిలో భాగంగా పెన్షన్స్ పాజిటివ్ పబ్లిక్ ప్రెసిప్షన్‌పై విసి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని సచివాలయాల సిబ్బంది, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.